ఇంటి పన్ను తగ్గించాలని సీఎంకు లేఖ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను చూపిస్తున్న కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలు చేస్తున్న ఇంటి పన్ను లెక్కింపు విధానం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.సుధాకర్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులు నదీమ్, వినయ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రమీళలు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలు చేస్తున్న ఇంటి పన్ను లెక్కింపు విధానం వల్ల నివసిస్తున్న వారిలో ఒక్కకరికి ఒకొక్క రకంగా ఇంటి పన్ను రావడండతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖరాయడం జరిగిందన్నారు. కార్పొరేషన్ రిజిస్ట్రేషన్ విలువకు ఇంటి పన్నుకు ముడిపెట్టి లెక్కిస్తున్నందున సమస్య ఉత్పన్నం అయిందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ధరలు పెరిగినప్పుడల్లా దానికి అనుగుణంగా ఇంటి పన్నులు కూడా మారుతున్నాయన్నారు. ఇంటి పన్నును రిజిస్ట్రేషన్ ధరలతో ముడిపెట్టకుండా వార్షిక అద్దె విలువ పద్ధతిన ఇంటిపన్ను నిర్ధారించాలని కోరుతున్నామన్నారు. ఇదే విషయాలను ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సభ్యులంతా కలిసి ఇంటిపన్నులు, నీటి సరఫరా, ఇతర సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామన్నారు.

మణికొండలో చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం



డ్రస్ మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్న మహిళలు



అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన బట్టలు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ సేల్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమైంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యూయలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను అమ్మకాలు జరుపుతున్నారు. అనేక రాష్ట్రాలలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలు దారులు ఆదరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని మణికొండ వాసులు వినియోగించుకోవాలని వారు కోరారు.

కాంగ్రెస్ ఖాతాలో నార్సింగి మున్సిపాలిటీ

- సజావుగా సాగి నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- తీర్మానానికి మద్దతు తెలిపిన 14 కౌన్సిలర్లు
- కార్యాలయం వద్ద భారీ బందోబస్తు
- కొత్త ఛైర్‌పర్సన్‌గా నాగపూర్ణ శ్రీనివాస్

మణికొండ: కాంగ్రెస్ ఖాతాలో మరో మున్సిపాలిటీ చేరింది. నార్సింగి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం సజావుగాసాగి నెగ్గింది. 12 మంది కౌన్సిలర్లు వారికి వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానానికి రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి సమక్షంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ముందుగా ఛైర్‌పర్సన్ డి. రేఖయాదగిరిపై అవిశ్వాస సమావేశం నిర్వహించి, ఆ తరువాత 12.30 గంటలకు వైస్ ఛైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌పై సమావేశం నిర్వహించారు. రెండు సమావేశాలలో వారికి వ్యతిరేకంగా 14 మంది కౌన్సిలర్లు పాల్గొని ఓటు వేయటంతో వారి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈనెల 13వ తేదీ నుంచి గోవాలో క్యాంపు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయానికి మినీబస్‌లో తీసుకుని వచ్చారు. కౌన్సిలర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని మాత్రమే కార్యాలయంలోకి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనుమతించారు. దీంతో ముందుగా ఛైర్‌పర్సన్, తరువాత వైస్ ఛైర్మన్లపై పెట్టిన అవిశ్వాస సమావేశాలలో వారు ఓటు వేసి నెగ్గారు.



అవిశ్వాస తీర్మాన వివరాలను వెల్లడించిన ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏసీపీ రమణగౌడ్

పెరిగిన సభ్యుల బలం...

నార్సింగి మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్ల బలం ఉండగా అవిశ్వాసానికి మూడింట రెండువంతులు 12 మంది సభ్యుల మద్దతును కాంగ్రెస్ నాయకులు కూడగట్టారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆ బాధ్యతలను రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్‌లకు అప్పగించింది. తమ పార్టీ బలాన్ని ఏడు నుంచి 10మంది సభ్యులకు పెంచటంతో పాటు అవిశ్వాసానికి అవసరమైన ఇద్దరు బీజేపీ సభ్యుల మద్దతును కూడగట్టారు. దీంతో 12 మందికి బలం పెరగటంతో జిల్లా కలెక్టర్‌కు లేఖను అందించారు. శనివారం జరిగే అవిశ్వాస సమావేశానికి తమ బలాన్ని మరింత పెంచుకునే దిశగా వేసిన అడుగులు ఫలించి వట్టినాగులపల్లి 1వ వార్డుకు చెందిన స్వతంత్ర కౌన్సిలర్ బి. యాదమ్మ, నార్సింగికి చెందిన 6వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పి. శ్రీకాంత్‌రావులు మద్దతు తెలపడంతో వీరి బలం ఏకంగా 14కు పెరిగి సునాయాసంగా అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకున్నారు.



క్యాంపు నుంచి వచ్చిన కౌన్సిలర్‌లు, నాయకులు

సమావేశానికి నలుగురు దూరం...

నార్సింగి మున్సిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ డి. రేఖ యాదగిరి, మాజీ వైస్ ఛైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌లు శనివారం నిర్వహించిన అవిశ్వాసం సమావేశానికి దూరంగా ఉన్నారు. వారితో పాటు నార్సింగి 7వ వార్డు కౌన్సిలర్ జి.అరుణజ్యోతి, గండిపేట 13వ వార్డు కౌన్సిలర్ విజిత ప్రశాంత్‌యాదవ్‌లు సమావేశానికి హాజరు కాలేదు. ఈ నలుగురు తప్ప మిగతా 14 మంది కౌన్సిలర్లుఉ అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు.

కొత్త ఛైర్‌పర్సన్‌గా నాగపూర్ణ శ్రీనివాస్

నార్సింగి మున్సిపల్ నూతన ఛైర్‌పర్సన్‌గా మంచిరేవుల గ్రామం 10వ వార్డు కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ను, వైస్ ఛైర్మన్‌గా కోకాపేట గ్రామం 3వ వార్డు కౌన్సిలర్ గోపాల విజయ్‌బాబులను ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రకటించారు. జిల్లా కలెక్టర్ తేదీ ప్రకటించగానే వారిని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకుంటారని పేర్కొన్నారు.

భారీ బందోబస్తు...

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవిశ్వాసం ప్రత్యేక సమావేశాన్ని సజావుగా నిర్వహించేందుకు నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ ఆధ్వర్యంలో సీఐ హరికృష్ణారెడ్డి సమక్షంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు బారీకేడ్లు ఏర్పాటు చేసి మూసి వేశారు. మున్సిపల్ కార్యాలయం గేట్లను మూసి వేసి కౌన్సిలర్‌లను ఐడీ కార్డులను చూసిన అనంతరం లోనికి అనుమతించారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు

వాహనదారులు, ఆటోవాలకు కౌన్సెలింగ్

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్లపై చెత్తను వేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్న వారికి జరిమానా విధిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి శానిటేషన్ సూపర్ వైజర్ సామేష్ తెలిపారు. శనివారం డివిజన్‌లోని మధుబన్ కాలనీలోని ఎర్రకుంట ప్రధాన రహదారిపై ప్రతినిత్యం రోడ్లపై చెత్తను వేస్తున్న వారిపై జరిమానా విధించారు. ఉదయం సమయంలోనే ఆరుగురు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌కాలనీ నుంచి ఎర్రకుంట ప్రధాన రహదారిపై చెత్తను వేస్తున్న సమయంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ సామేష్, ఎస్ఎఫ్ఏ జాషువాతో కలిసి జరిమానా వేసి చెత్తను రహదారులలో వేయకూడదని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం సూపర్‌వైజర్ సామేష్ మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆటోలు చెత్తను సేకరించడానికి ఇంటింటికీ రావడం లేదని స్థానికులు, శ్రీరామ్‌కాలనీవాసులు తెలుపుతున్నారని అన్నారు. చెత్తను సేకరించే ఆటోలు ఇంటి వద్దకు వస్తే చెత్తను ఎర్రకుంట సమీపంలో ఎందుకు వేస్తామని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. చెత్త ఆటోలు ఇంటింటికీ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితులలో రోడ్లపై చెత్త వేయరాదని ప్రజలకు సూచించామన్నారు. ఎవరైనా చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



ఎర్రకుంట ప్రధాన రహదారిలో బైక్‌పై చెత్త వేసిన వారికి జరిమానా విధిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

23 నుంచి స్పాట్ కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: కళాశాలలు, రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల వారు ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ (ఎంఎల్‌టీ ఒకేషనల్ బాలికలు మాత్రమే) (సీఈసీ.హెచ్‌ఈసీ బాలురకు మాత్రమే)(గ్రూపులలో మిగిలిన సీట్లకుగాను 2023-2024 సంవత్సరం పదో తరగతిపాసైన విద్యార్థులు ఈ నెల 23న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని హైదరాబాద్, రంగారెడ్డి రీజియన్ ఇంటర్ ప్రాంతీయ అధికారి పీఎస్ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం మానస హిల్స్ రాజేంద్రనగర్ రంగారెడ్డి జిల్లా నందు మే 23న బాలురు, మే 25న బాలికలు ఉదయం 10:30 లకు గిరిజన విద్యార్థి, విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్‌తో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7382931496 సంప్రదించాలని తెలిపారు.

ధర్మంగా విజయం సాధించాం

రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచినా అప్పట్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం అండతో ఎక్స్ అఫిషియో ఓట్ల బలంతో దక్కించుకుందని, దాన్ని తిరిగి ధర్మం, న్యాయబద్ధంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లపై జరిగిన సమావేశానికి కౌన్సిలర్లలను తీసుకుని ఆయన వచ్చారు. అవిశ్వాసాలు గెలిచిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయబద్ధంగా నార్సింగి మున్సిపాలిటీలో అప్పుడే కాంగ్రెస్ పాలకకమిటీ ఏర్పాటు కావాలన్నారు. అలాంటి దాన్ని అధికార బలం, ఎక్స్ అఫిషియో ఓట్లతో బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుందన్నారు. అలాంటి దాన్ని తిరిగి తమ పార్టీ కైవసం చేసుకోవటానికి సహకరించిన పార్టీ నాయకులు, కౌన్సిలర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన లతా ప్రేమ్‌కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపడుతారన్నారు. నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీలోను తమ పార్టీ విధానాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కౌన్సిలర్లు పార్టీ మారేందుకు ముందుకు వస్తున్నారని, దానిని కూడా త్వరలోనే కైవసం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు డి. కిరణ్, గోపాల గణేష్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, వినోద్‌కుమార్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



అవిశ్వాసం నెగ్గాక మీడియాతో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లిమ్స్ ఆస్పత్రిఆరో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

శంషాబాద్: గ్రామీణ ప్రజలకు తక్కువ ధరలకే మెరుగైన వైద్యసేవలందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కరోనా సమయంలో లిమ్స్ ఆస్పత్రి అందించిన సేవలకు రాష్ట్ర గవర్నర్‌తో పాటు రెడ్‌క్రాస్ సంస్థలు సైతం అభినందించిన తీరును ఆయన ప్రశంసించారు. లిమ్స్ ఆస్పత్రి ఆరో వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వైద్యో నారాయణహరి అన్న విషయాన్ని ప్రతి వైద్యులు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ ఎంతో నమ్మకంతో వస్తాయని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయవద్దని సూ చించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండి రామరాజు, డాక్టర్ స్మిత, డాక్టర్ సంతోష్, డాక్టర్ నితీష్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మణికొండలో శ్రీదేవి డిజైనర్ స్టూడియో బొటిక్ ప్రారంభం

మణికొండ: వైబ్రెంట్ ఫ్యాషన్ ల్యాండ్‌స్కేప్‌కు అదనపు హంగులు జోడిస్తూ మణికొండలో కొత్త శ్రీదేవి డిజైనర్ స్టూడియో ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంది. గత 15 సంవత్సరాలుగా ఫ్యాషన్ ప్రపంచంతో పాటు సినిమా రంగంలోనూ రాణిస్తూ తనదైన ముద్ర వేసుకున్న శ్రీదేవి డిజైనర్ స్టూడియో తన రెండో బ్రాంచ్‌ను మణికొండ, ఓయూ కాలనీలలో శనివారం లావణ్య సాహుకార (అన్నపూర్ణ ఫొటో స్టూడియో ఫేం) చేతుల మీదుగా ప్రారంభించారు. ఫ్యాషన్ ప్రియుల అభిరుచులకు అనుగుణంగా విభిన్నమైన డిజైనర్ అవుట్‌ఫిట్స్ అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని శ్రీదేవి డిజైనర్ స్టూడియో అధినేత శ్రీదేవి చౌదరి పేర్కొన్నారు. దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి డిజైనర్ స్టూడియో బొటిక్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి కాలనీలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజల్లో కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజునాయక్, కాలనీ వాసులు నర్సింహాచారి, శంకర్‌నాయక్, రాజశేఖర్, ధరంవీర్, ప్రభాకర్, శివకుమార్, శ్రీధర్, జగన్, ప్రవీణ్, సుందర్‌నాయక్, సంతోష్, రాజు, శ్రీకాంత్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్



'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం'

గోల్కొండ: రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పతనమై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అదే విధంగా కేంద్రంలో పదేళ్ల అరాచక పాలన అంతం కావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ కార్వాన్ ఏ బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారన్నారు.

టీఎస్ ఈఏపీసెట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ



నిష్ఠ

రాజేంద్రనగర్: తెలంగాణ ఈఏపీసెట్(ఈఏపీసీఈటీ)లో ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థిని పి.నిష్ఠ 82.91 మార్కులతో 3367 ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకుతో తెలంగాణలో అగ్రికల్చర్ కోర్సులో కానీ... ఫార్మసీ కోర్సులో కానీ సీటు వచ్చే అవకాశముంది. అంతేకాకుండా నిష్ఠ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్ష కూడా రాసింది. నిష్ఠ ఇంటర్ వార్షిక పరీక్షలో బైపీసీ గ్రూపులో 987 మార్కులు సాధించింది. ప్రభుత్వ కళాశాలలో చదివి ఏపీసెట్‌లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ర్యాంకును సాధించడం గొప్ప విషయమని ప్రిన్సిపాల్ అంజయ్య అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిష్ఠను కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, స్టాఫ్ మాన్య, స్వప్న, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మురళీ, కరుణాకర్, శ్రీజన్య, నవీన్, కిషన్, గోపి కృష్ణా రెడ్డి, చంద్రశేఖర్, పార్థ సారథి, శశిధర్, భరత్, నర్సింగ్, కుమార్‌లు అభినందించారు.

ఆర్థిక లావాదేవీలతో వ్యక్తిపై దాడి



చికిత్స పొందుతున్న ఫిర్దోస్

అత్తాపూర్: ఆర్థిక లావాదేవీల కారణంగా ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు జిల్లాకు చెందిన మహమ్మద్ రహీం గతకొన్ని సంవత్సరాలుగా హసన్‌నగర్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నాడు. ప్లాటు కొనుగోలు వ్యవహారాల కారణంగా ఓల్డ్ సిటీ జలాల్ బాబానగర్ ప్రాంతానికి చెందిన మోసిన్‌అలీ (33) రూ.20లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు 226 పిల్లర్ నెంబర్ పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్‌వే ప్రాంతంలోని మార్బుల్ షాపులో మాట్లాడుకుందామని కలుసుకున్నారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాలుగా తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వపోగా నిర్లక్ష్యం చేయడం ఏమిటని రహీం నిలదీశాడు. ఈ క్రమంలోనే మహమ్మద్ రహీం వద్ద అంగరక్షకుడుగా పనిచేస్తున్న ఫిర్దోస్, మోసిన్ అలీల మధ్య మాటామట పెరిగి గొడవ జరిగింది. దీంతో వెంట తెచ్చుకున్న కత్తితో మోసిన్‌అలీ ఫిర్దోస్‌పై దాడిచేసి పరారయ్యాడు. వెంటనే ఫిర్దోస్‌ను చికిత్స నిమిత్తం అత్తాపూర్‌లోని జియో ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మోసిన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



కన్యకాపరమేశ్వరి పూజల్లో వాసవిక్లబ్ కపుల్స్



కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో కన్యకాపరమేశ్వరి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మణికొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం ఆవరణలో మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, రుద్రహోమం, శ్రీ లక్ష్మీకుబేర హోమం, వాసవీ అమ్మవారి హోమం, అభిషేకం, కుంకుమార్చనలను నిర్వహించారు. అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు, కన్యకాపరమేశ్వరి భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా వాసవి క్లబ్ కపుల్స్ వారి కులదేవత కన్యకాపరమేశ్వరికి అర్చన, అభిషేకం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణికొండ వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వి. వంశీకృష్ణ, కార్యదర్శి టి. యశ్వంత్, కోశాధికారి శిరీషలతో పాటు నాయకులు కె. నిరీష, జి. నవీన్‌కుమార్, రామ్ సురేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



టిప్పుఖాన్ బ్రిడ్జిపై..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. టిప్పుఖాన్ బ్రిడ్జిపై రోడ్డు మరీ అధ్వానంగా మారి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే విధంగా ఉంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళ వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అనుకొని ప్రమాదం జరిగితే భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

నేడు హెచ్‌సీయూలో 'వైటథాన్-2024 రన్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆదివారం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్-2024' రన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లో ఉదయం 5.45 గంటలకు ఈ రన్‌ను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్ రావు కలిసి ప్రారంభిస్తారు. ఎల్‌వి ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్, ఇన్‌స్టిట్యూట్ ఆపరేషన్ ఐసైట్ యూనివర్సల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐ క్యాన్సర్ హెడ్ డాక్టర్ స్వాతి కల్కి, అపోలో క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొంటారు.